క్లుప్తంగా

నిధులు కేటాయించండి

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి తగు నిధులను కేటాయించాలని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం ఆయన ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ మండలాల్లో అభివృద్ధి పనులకు మండలానికో ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. కరకట్టను 530 మీటర్ల మేర పొడిగించి నిర్మాణం చేయాలని విన్నవించారు. స్పందించిన సీఎం కేసీఆర్ పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా వెంకట్రావ్ తెలిపారు.

'అభివృద్ధి ప్రధాత'

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అని మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే రేగా కాంతారావు పని చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఆయనను గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, ఎంపీటీసీలు గుడిపూడి కోటేశ్వరరావు, తాటి సరిత, మచ్చ సమ్మక్క, బేగా రమ్య, మండల కో ఆప్షన్ సభ్యులు జావిద్‌పాషా పాల్గొన్నారు.

పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే..

చండ్రుగొండ: సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని, చరిత్రల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని సీపీఎం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి అన్నారు. అమరవీరుల వారోత్సవ సభ స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగింది. నాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధపోరాటంలో వందలాది మంది అసువులు బాసారన్నారు. అమరవీరులకు విప్లవజోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సర్పంచ్ కాక సీత, పెద్దిని వేణు, ఆర్ వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాజా, కృష్ణయ్య, శేషగిరి, శివ పాల్గొన్నారు.

15 నుంచి క్రీడా పోటీలు

గుండాల: ఈ నెల 15 నుంచి గురుకుల క్రీడా మైదానంలో విద్యార్థినీ, విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించబడుతాయని క్రీడా కన్వీనర్ కిషన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విద్యార్థినీ, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు అథ్లెటిక్స్ విభాగాలలో క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బాల, బాలికలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాల వితరణ

ములకలపల్లి: అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ములకలపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను వితరణగా అందజేశారు. మండలపరిధిలోని మూకమామిడి గ్రామానికి చెందిన వడ్రంగి చలపతి ఇల్లు మంగళవారం ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. ఘటనలో సర్వస్వం కోల్పోయిన చలపతి కుటుంబానికి సాటి కార్పెంటర్లు అండగా నిలిచారు. యూనియన్ అధ్యక్షుడు మద్దోజు గంగాధరాచారి ఆధ్వర్యంలో సేకరించిన బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

అనుమతి తప్పనిసరి

దుమ్ముగూడెం: వినాయక విగ్రహాలు పెట్టాలి అనుకునే వారు విద్యుత్, పోలీస్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి అని సీఐ దోమల రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైక్ పర్మిషన్ కోసం మీసేవలో డీడీ తీసి, గ్రామ పంచాయతి నుంచి అనుమతి పత్రాలలో పాటు ఆన్‌లైన్‌లో సరైన వివరాలతో నమోదు చేసుకున్న వారికి మాత్రమే అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ చేసుకోనివారికి అనుమతులు ఉండవని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిక

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాయం తన క్యాంప్ కార్యాలయంలో వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మణుగూరు వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ వీరంకి వెంకట్రావుగౌడ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్‌పై హర్షం

భద్రాచలంఅర్బన్: మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ (బీఆర్టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సేవలను గుర్తించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారానికి బ్రేకులు

- సమ్మెబాటలో అంగన్‌వాడీ సిబ్బంది
- మూతబడిన కేంద్రాలు
- చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు


మూతబడిన అంజనాపురం అంగన్‌వాడీ కేంద్రం

బూర్గంపాడు: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. సమ్మె శిబిరాలలో కూర్చుంటున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. కేంద్రాలలో చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం నిలిచిపోయింది. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు కూడా పౌష్టికాహారం అందడం లేదు. అక్కడక్కడ ఐసీడీఎస్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెలో ఉన్నారని తెలిసి చిన్నారులను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్లకు పంపడం లేదు. అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించిన సరుకులు, వస్తువులు ఆయా సెంటర్లకు సంబంధించిన టీచర్లు, హెల్పర్ల వద్ద ఉంటాయి. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భావించినప్పటికీ సరుకులు, గిన్నెలు అందుబాటులో ఉండడం లేదు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు చర్యలు చేపట్టారు. అయితే వంట చేయటం వస్తేనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సాధ్యమవుతుంది. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె విరమించే వరకు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు గుడ్లు,పాలు, ఇతర సరుకులు ఇంటికి ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నారు.

బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 158 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెతో దాదాపు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. మంగళవారం మాత్రం మొక్కుబడిగా 25 సెంటర్లను ఐసీడీఎస్ అధికారులు తెరిపించారు. మొత్తంగా ప్రతిరోజు గుడ్డు, ఇతర పౌష్టికాహారం తింటున్న చిన్నారులు సమ్మెతో అవి అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిన్నారులకు ఇబ్బంది

మూడు రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను తెరవడం లేదు. చిన్నారులకు ఇచ్చే గుడ్లు, పాలు, ఇతర పౌష్టికాహారం నిలిచిపోయింది. చిన్నారులకు వారం రోజులకు సరిపడా పౌష్టికాహారం ముందుగా అందించాలి.

– అరుణ, పేరెంట్, అంజనాపురం

సెంటర్లు తెరిపించాలి

అంగన్‌వాడీ సెంటర్లు తెరిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. సెంటర్లు మూతపడటంతో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ఇబ్బందిగా మారింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పౌష్టికాహారమందించాలి.

– ధరావత్ ప్రియ, పేరెంట్, అంజనాపురం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. మంగళవారం కొన్ని సెంటర్లు తెరిపించాం. ఒకట్రెండు రోజులలో అన్ని సెంటర్లలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

– కె.సీతారాములు, సీడీపీఓ, బూర్గంపాడు ప్రాజెక్ట్

ఉత్తమ పంచాయతీగా గుండాల


సర్పంచ్ సీతారాములుకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రియంక అల

గుండాల: స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ అవార్డుకు గుండాల గ్రామ పంచాయతీ ఎంపికైనట్లు సర్పంచ్ కోరం సీతారాములు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గుండాల గ్రామ పంచాయతీని గుర్తించి అవార్డు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూధన్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్, సీఈఓ శిరీష, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వలీ, ఏపీఓ రవితేజ, కార్యదర్శి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అభినేపల్లి పంచాయతీకి..

దమ్మపేట: స్వచ్ఛ్ సర్వేక్షన్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికై హైదారాబాద్‌లో అవార్డు పొందిన అభినేపల్లి గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల అభినందించి, ప్రశంసా పత్రం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో గతంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన అభినేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆళ్ల ప్రభావతి, కార్యదర్శి సురేష్‌లను శాలువాతో సత్కరించిన కలెక్టర్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

దుమ్ముగూడెం: ఈ సంవత్సరం క్లాస్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని పోటీ పడాలని కెనరా బ్యాంక్ మేనేజర్ డి.బాలకృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ హైస్కూల్‌లో కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకం కింద 8,9,10 తరగతిలో గత ఏడాది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 10వ తరగతి అనూష, 9వ తరగతి రాధిక, 8వ తరగతి సమీరా సింహానిలకు రూ.5వేల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం కెవి.కాంతారావు, విద్యా కమిటీ చైర్మన్ విద్యాసాగర్, కెనరా బ్యాంక్ సిబ్బంది సత్యనారాయణ, సూదిరెడ్డి రమణారెడ్డి, సర్పంచ్ వర్షా శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల కూలి పెంపు


కూలీలు, రైతులతో చర్చిస్తున్న మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం, దంతెనం, రేగుబల్లి మూడు గ్రామపంచాయతీలో వ్యవసాయ కార్మికులు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచుకున్నారు. ఈ మేరకు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చర్చించి 250 నుంచి 300కు పెంచుకునేందుకు నిర్ణయించారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ సమావేశం నిర్వహించగా.. రైతు సంఘం రాష్ట్ర నాయకులు యలమంచి రవి కుమార్ నియోజకవర్గం కోకన్వీనర్ కారం పుల్లయ్య, రైతు జిల్లా అధ్యక్షుడు వంశీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, మర్మం చంద్రయ్య, బొల్లి సత్యనారాయణ, వర్ష చిన్నారావు, రైతులు లోకేష్ రావు, శ్రీనివాసు, కొల్లు శ్రీనివాసు, రవి, కార్మికులు సావిత్రి, పద్మ, బువ్వమ్మ, సుజాత, సరిత, సుధారాణి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నూతన విభాగాలు ఏర్పాటు


నూతన విభాగాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఆయుర్వేదిక్, యునాని, హోమియో విభాగాలతో పాటు ఇంటిగ్రేటెడ్ యోగా సెంటర్‌ను స్థానిక శాసనసభ్యులు పొదెం వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ప్రజలు నూతనంగా ప్రారంభించిన ఆయుర్వేదిక్, యునానీ, హోమియో విభాగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆయుర్వేద వైద్యుడు వెంకటేశ్వర్లు, రాకేష్, ఆయుర్వేదిక్ ఫార్మసిస్ట్ వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్న డాక్టర్లు

గుండాల: ఇటీవల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఇల్లెందు డీఎస్పీ రమణ మూర్తి అన్నారు. గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవిరామారం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోరాదని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నట్లయితే తీవ్రత పెరిగి ప్రాణానికి ప్రమాదమన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించాలని, సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం వైద్యాధికారులు రేవంత్, మనీష్‌రెడ్డి మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. అనంతరం పండ్లు, స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, ఎస్సైలు రాజశేఖర్, రతీష్, ఎంటీఎస్ సత్యం, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, బిక్షయ్య, శ్రీదర్, సమత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కరకగూడెం: మండలంలోని రాయనపేట గ్రామానికి చెందిన కొమరం లక్ష్మి ఇటీవల పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతిచెందగా.. బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ నవీన్ బాబు మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం స్వగ్రామం రాయన పేటలో కలిశారు. 50 కేజీల బియ్యం, రూ.5 వేలను అందజేశారు. ఎంపీపీ రేగా కాళిక, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ కొమరం రాంబాబు, మండల యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్, సర్పంచ్ నర్సింహారావు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా బురదమయమైన 20 గ్రామాల ప్రజల అవస్థలకు కారణమైన అశ్వాపురం -గొందిగూడెం ప్రధాన రహదారి పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభమయ్యాయి. అశ్వాపురం నుంచి గొందిగూడెం, తుమ్మలచెరువు మీదుగా మొండికుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరై టెండర్లు, అగ్రిమెంట్ సైతం పూర్తయి నెలలు గడుస్తున్నా రహదారి పనులు ప్రారంభం కాలేదు. ప్రజలు రహదారి మోకాళ్లలోతు బురద ఉండి అడుగుతీసి అడుగు పెట్టలేని దుస్థితితో ఉన్నారు. ఈ పరిస్థితిపై సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో పనులు ప్రారంభం అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మణుగూరురూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పినపాక మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి బీటీపీఎస్‌లో పని చేస్తూ మణుగూరులో నివాసం ఉంటున్నాడు. బుధవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై మణుగూరుకు వస్తున్నాడు. అదే సమయంలో ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్న కంపెర్ల కల్యాణ్ ద్విచక్రవాహనంపై విజయనగరం గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సీఎస్పీ కాటా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కల్యాణ్‌ను అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో ఆటోలో తరలిస్తున్న 30 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరావు, భూక్యా భావనను అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. కాగా సుజ్ఞానపురం గ్రామానికి చెందిన నాటుసారా విక్రేతలు 9మందిని ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ చంద్రశేఖర్ ముందు బైండోవర్ చేశారు.

సారా విక్రేతలపై కేసు నమోదు

కరకగూడెం: నాటుసారా విక్రయిస్తున్న మండలంలోని కలవలనాగారం గ్రామానికి చెందిన కలం నర్సింహారావు, దేవరనాగారం గ్రామానికి చెందిన పొలం వెంకటనర్సమ్మ, తోలం లక్ష్మిలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజరాం తెలిపారు.

భద్రాద్రి జిల్లా పేరు మార్చాలి

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు మార్చాలని భద్రాద్రి రెవెన్యూ డివిజన్ పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు మారేడు శివాజీ, పిలక రాము బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సీతారామచంద్ర స్వామివారు నడియాడినేల కావడంతో ఈ జిల్లాకు సీతారామ జిల్లాగా పేరు మార్చాలన్నారు. అలాగే ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలిపి సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులను వెంటనే విడుదల చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు అన్నారు. పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సరిపడే ఆశ్రమాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నేడు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

కొనసాగుతున్న సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం కొనసాగింది. ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.10లక్షలు, హెల్పర్‌కు రూ.5లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న సంఘాలతో చర్చలు జరపకుండా అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడాన్ని తీవ్రంగా విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


దమ్మపేట: సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న జిల్లా నాయకులు


మణుగూరురూరల్: మద్దతు తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య

పనులను ప్రారంభించిన ఎంపీపీ

దుమ్ముగూడెం: మండలంలోని చిన బండిరేవు గ్రామ పంచాయతీ పరిధిలోని గడ్డోరిగట్టు గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు సుమారు 7.50 లక్షలతో నిర్మాణం చేపట్టిన 2 సీసీ రోడ్డు పనులను ఎంపీపీ రేసు లక్ష్మి బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం జయ, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానీపాషా, వార్డ్ సభ్యులు మిడియం భద్రయ్య, ఇరకం దుర్గమ్మ, తంతరపల్లి వెంకటేశ్వరరావు, మంగయ్య, కాక చంద్రయ్య, మడకం భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులకు ఏర్పాట్లు

చర్లరూరల్: గణనాథుడి నవరాత్రి ఉత్సవాలకు చర్ల ముస్తాబవుతోంది. మరో వారం రోజుల్లో వాడవాడలా కొలువుదీరనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నవరాత్రులూ ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించిన అనంతరం తాలిపేరు, గోదావరి నదుల్లో నిమజ్జనం చేసేందుకు సిద్ధమౌతున్నారు. పట్టణంలోని గణేష్ నగర్, రఘు థియేటర్ రోడ్డు, బస్టాండు సెంటర్, సూపర్ బజార్, బంక్ ఏరియా, పాతచర్లతోపాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి సంబరాలు చేసుకునేందుకు నిర్వాహకులు ఇప్పటికే గణేష్ మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

టీడీపీ నాయకుల ర్యాలీ

మణుగూరురూరల్: మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ సురక్షా బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగింది. నాయకులు లత, చందా మదు, దొడ్డి కృష్ణ, కూచిపూడిబాబు, బచ్చల భారతి, పసునూరి సీత, పురిటి విజయలక్ష్మి, చావా శ్రీదేవి, పసునూరి కృష్ణ, ఎం శ్రీనివాసరావు, రఘురాం, నాగేశ్వరరావు, శంకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చన, నాగహారతి, ధూపసేవా తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు స్వామి వారి అన్నప్రసాదాలను అందజేశారు. స్వామి వారి కల్యాణంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటును వినియోగించుకోవాలి

అశ్వారావుపేట: ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వీకేడీవీ కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు సూచించారు. వీకేడీవీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటర్ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటరుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. భావితరాల అభివృద్ధికి కృషిచేసే నిస్వార్థ నాయకులను ఎన్నుకోవాలని, తద్వారా చక్కటి ప్రభుత్వ ఏర్పాటుకు వీలుంటుందని అన్నారు.

యువత చేతుల్లోనే దేశం

చర్ల: దేశం మొత్తం కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లోకి పోతోందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపైనే ఉందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. గురువారం చర్లలో జరిగిన పీవైఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మత్తుతో కొన్ని శక్తులు దేశాన్ని చిన్నాభిన్నం చేయాలని చూస్తున్నాయని అన్నారు. నాయకులు వైఎస్ రెడ్డి, ఉమా, రామకృష్ణ, శ్రీకాంత్, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీఎస్పీ


బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామంలో బుధవారం గడప గడపకూ బీఎస్పీ కార్యక్రమాన్ని చేపట్టారు. బహుజన సమాజ్ పార్టీ గుర్తు ఏనుగును ప్రజలకు పరిచేయం చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి చేయాల్సిన అవశ్యకతను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి కేసుపాక కృష్ణ, పాక వెంకటేశ్వర్లు, అల్లం కోటి, పెరుమాళ్ల మోహన్, జబ్బ కృష్ణ, పీక మల్లేష్, ఎస్‌కె.సలీమ్, కంచర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

దుమ్ముగూడెం: పథకాల పేరుతో ప్రభుత్వం ప్రజాధనం నిర్వీర్యం చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ విమర్శించారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంచర్ల సింహాద్రి ఆధ్వర్యంలో ఇంటింటికీ బీఎస్పీ- ఆర్ఎస్‌పీ కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఇళ్లు నాసిరకంగా ఉన్నాయని, ఆ ఇళ్లను కూడా లబ్ధిదారులకు అప్పజెప్పలేదని ప్రజల నుంచి విమర్శలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిద దామోదర్ రావు, భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షుడు సోడి వీరస్వామి, బొర్రా రాజు, సున్నం సుభద్ర, సున్నం ముతేష్ పాల్గొన్నారు.